ఓవర్‌లోడ్ సమస్యకు చెక్

- నగరంలోని డీ-4 సెక్షన్ పరిధిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- 8 కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 12.5 కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు


నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న అధికారులు


డీ-4 సెక్షన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతంలో గత పదేళ్లుగా తరచుగా విద్యుత్ సరఫరాలో ఓవర్‌లోడ్ లేదంటే లోటల్టేజ్ సమస్యతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతుండేవారు. గతేడాది సమస్య తీవ్రతరం కావడంతో ట్రాన్స్ కో-అధికారులు సమస్య పరిష్కారానికి కార్యాచరణ రూపొందించారు. ఈక్రమంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి, మంగళవారం అధికారులు ప్రారంభించారు. దీంతో నగరంలోని డీ-4సెక్షన్ (వినాయక్‌నగర్) సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది.

డీ-4 సెక్షన్‌లో 26వేల కనెక్షన్లు..

నగరంలోని డీ-4సెక్షన్(వినాయక్‌నగర్) అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ సెక్షన్‌చాలా పెద్దది. ఇందులోనే గత నాలుగు సంవత్సరాల క్రితం డీ-7సెక్షన్(ఆర్యనగర్) ఏర్పడింది. ప్రస్తుతం సెక్షన్ పరిధిలో గృహాలు, వ్యాపార వాణిజ్య సంస్థలకు సంబంధించిన సర్వీస్ కనెక్షన్‌లు 26వేలకు పైగా ఉన్నాయి. వీటి పరిధిలో వినాయక్‌నగర్, శ్రీనగర్‌కాలనీ, గాయత్రినగర్, కోటగల్లీ, న్యాల్‌కల్‌రోడ్, చంద్రనగర్, 100ఫీట్ల రోడ్, ఓల్డ్ హౌసింగ్‌బోర్డు, పాటిగల్లీ, యాదగిరిబాగ్, గూడెం కాలనీ తదితర ఉన్నాయి. హైదరాబాద్‌రోడ్ కావడంతో వ్యాపారవాణిజ్య సంస్థలు ఏర్పడుతునే ఉన్నాయి. రోజురోజుకు కొత్త కనెక్షన్‌ల సంఖ్య పెరుగుతుంది. దీంతో లోడ్ సమస్య పెరుగుతుంది. తద్వారా ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్‌లో 8.0ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్‌పెరుగుతూ వచ్చింది. గత ఏడాది నుంచి ఈ సమస్య మరింత అధికమైంది. దీంతో తరచుగా ఓవర్‌లోడ్, లేదంటే లో-వోల్టేజ్ సమస్యతో వినియోగదారులకు అంతరాయం ఏర్పడేది.

కంపెనీ చరిత్రలో మొదటిసారి..

ఈ సబ్‌స్టేషన్‌లో 8.0 కెపాసిటి పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా లోడ్ సరిపోయేది కాదు. ఈ విషయాన్ని ఏఈ నాగశార్వనీ గుర్తించి ఏడీఈ వీరేశం ద్వారా నిజామాబాద్ డివిజన్ డీఈ శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. గత రెండేళ్లుగా ఓవర్‌లోడ్, అక్కడక్కడ లో-ఓల్టేజ్ సమస్య ఎదురవుతుడటంతో నిజామాబాద్ డివిజన్ ఇంజినీర్ శ్రీనివాస్‌రావు, ఎస్ఈ రవీంధర్‌లు ప్రత్యేక శ్రద్ధతో సమస్య పరిష్కారానికి కార్యచరణ రూపొందించారు. సీఎండీ వరుణ్ రెడ్డిని ఒప్పించి మరీ కంపెనీ చరిత్రలోనే మొట్టమొదటిసారి 12.5 పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఏ ర్పాటు చేయించి ప్రారంభించారు. దీంతో విద్యుత్ సమస్య పరిష్కారానికి అడుగులు పడ్డాయి. ప్రారంభోత్సవంలో ఎస్ఈ రవీంధర్, డీఈలు శ్రీనివాస్‌రావు, రాజేశ్వర్‌రావు, ఏడీఈలు వీరేశం, తోట రాజశేఖర్, ఏఈ, ఉద్యోగులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ అందించడానికే..



వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో కలుగుతున్న ఇబ్బందులను గుర్తించాం. మరింత మెరుగైనా సరఫరా ఇవ్వడానికి సీఎండీ వరుణ్‌రెడ్డి సార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. దీంతో 8కెపాసీటీతో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 12.5కెపాసిటిగల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం అధికారులు, సిబ్బంది అందరం కలిసి ప్రారంభించాం. వినియోగదారులకు మెరుగైనా సరఫరా ఇవ్వడానికి శ్రమిస్తున్నాం. – ఎమ్ శ్రీనివాస్‌రావు, ట్రాన్స్‌కో డివిజన్ ఇంజినీర్

క్లుప్తంగా

సేంద్రియ ఎరువులు వాడాలి



డిచ్‌పల్లి: రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని, దీంతో భూసారం పెరిగి పంటలు అధిక దిగుబడి నిస్తాయని డిచ్‌పల్లి ఎంపీడీవో రవీందర్ అన్నారు. మండలంలోని నడిపల్లిలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ షెడ్‌లో ఆయన సేంద్రియ ఎరువుల తయారీ కోసం నట్టలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని సూచించారు. ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్‌రావు, సిబ్బంది శ్యాంసన్, సంతోష్, రాము, ప్రమోద్, రాజేందర్, అశోక్, సంజీవ్ పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి, రాంపూర్, మెంట్రాజ్‌పల్లి సహకార సంఘాల (సొసైటీ) ఆధ్వర్యంలో ప్రభుత్వం సబ్సిడీపై అందించిన జీలుగ విత్తనాలను మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి మండల వ్యవసాయాధికారి రాంబాబు మాట్లాడుతూ.. మండలంలోని నాలుగు సొసైటీల పరిధిలో మొత్తం 1144 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయన్నారు. 30కిలోల బస్తాకు రూ.2,790 లు ఉండగా ప్రభుత్వం సబ్సిడీపై రూ.1,116 లకే అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు మండల వ్యవసాయశాఖ ద్వారా పర్మిట్ తీసుకుని జీలుగ విత్తనాలు పొందాలని ఆయన సూచించారు. డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, రాంపూర్ సొసైటీ చైర్మన్ తారాచంద్, డైరక్టర్లు, ఏఈవో లు భావన, వంశీ, సంధ్యరేఖ, సీఈవోలు కిషన్, నాగరాజు, జోషీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి



సిరికొండ: రైతులు పండించే దొడ్డు, సన్న రకం లాంటి అన్ని రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం మండలకేంద్రంలో తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి సరిపడా ఎరువులు, పురుగు మందులను రైతులకు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి, రైతులకు పంటల సాగుకు వడ్డీ లేని రుణాలు అందించాలని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. నాయకులు బాబన్న, నారాగౌడ్, లింబాద్రి, సాయారెడ్డి, కిషోర్, బాజన్న, సాయిలు, నవీన్ తదితరులు పాల్గొన్నారు..

వికసించిన మే పుష్పాలు



సిరికొండ: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సాల్మన్ ఇంట్లో మే పుష్పాలు వికసించాయి. గత వారం రోజుల నుంచి విచ్చుకొని మంగళవారం పూర్తిగా వికసించాయని ఆయన తెలిపారు.

జాతీయ జెండా అవనతం



మోపాల్: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందడంతో కేంద్ర ప్రభుత్వం మంగళవారం సంతాపదినంగా ప్రకటించింది. ఈసందర్భంగా ప్రభుత్వ ఆదేశానుసారం మండలకేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో జాతీయ జెండాలను అవనతం చేశారు.

హామీలను నెరవేర్చాలి

బాల్కొండ: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి 100 రోజుల్లో పథకాలను అమలు చేస్తామని చెప్పి మాట మార్చారని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాజీనామా చేయాలన్నారు. తక్షణమే ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అలరించిన మ్యాజిక్ షో


తలపై మంటపెట్టి టీ తయారు చేస్తున్న రంగనాథ్


పూల బొకేలతో మ్యాజిక్..

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బాల్‌భవన్‌లో బాలబాలికలకు వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా మంగళవారం ప్రముఖ ఇంద్రజాలికుడు రంగనాథ్ ఇచ్చిన మ్యాజిక్ ప్రదర్శనలు అబ్బురపరిచింది. ఒక పసుపురంగు ఈకతో వేదికమీదికి వచ్చిన రంగనాథ్ క్షణంలో దాన్ని రంగురంగుల మ్యాజిక్‌స్టిక్‌గా మార్చారు. తలపై మంటపెట్టి టీ తయారు చేసి తాగించడం, ఒక పూల గుత్తిని, ఎన్నో పూలబొకేలుగా మార్చిన మ్యాజిక్ ఆకట్టుకుంది. గుర్తు తెలియని వారు బిస్కెట్లు, చాక్‌లెట్లు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌లు ఇస్తే తీసుకోవద్దని పిల్లలకు చెబుతూ మజా బాటిల్‌ను థమ్స్అప్ బాటిల్‌గా మార్చగానే పిల్లలు చప్పట్లు కొట్టారు. పేపర్‌ను పొట్లాంలా చుట్టి అందులో నీరుపోసి ఎన్నో గ్లాసులు, రిబ్బన్లు, బంతులు సృష్టించి అబ్బురపరిచారు. దాదాపు రెండు గంటలపాటు సాగిన ప్రదర్శన బాలల చప్పట్లు, అరుపులు కేరింతలతో బాలభవన్ మారుమోగిపోయింది. రంగనాథ్ మాట్లాడుతూ.. ఇంద్రజాలం వల్ల పిల్లల్లో ఉన్న భయాలు అపోహాలు తొలుగుతాయన్నారు. బాలభవన్ సూపరింటెండెంట్ విఠల్ ప్రభాకర్ మాట్లాడుతూ.. పిల్లల్లో సృజనాత్మకత, ఆలోచనకు పదును పెడుతుందన్నారు. అనంతరం రంగనాథ్‌ను సన్మానించారు. ఉమాబాల, వెంకటలక్ష్మి, పుష్పలత, కల్పన, గణేశ్, శ్రీలత తదితరులు ఉన్నారు.

వరి కొయ్యలను తగలబెట్టొద్దు



డిచ్‌పల్లి: పంట కోత అనంతరం రైతులు వరి కొయ్యలను తగలబెట్టవద్దని, అలా చేయడం వల్ల కాలుష్యంతో పాటు భూసారం దెబ్బతింటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతువేదికలో మంగళవారం హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా రైతులకు సమీకృత పోషక యాజమాన్యంపై అవగాహన కల్పించారు. విత్తన మేళ ఆవశ్యకత, వానాకాలానికి అనువైన కొత్త వరి వంగడాలైన డబ్ల్యూజీఎల్ 1119, డబ్ల్యూజీఎల్ 1487లపై శాస్త్రవేత్తలు వివరించారు. వ్యవసాయాధికారులు రాంబాబు, వెంకటేష్, హీరాజాదవ్, రవీందర్, దేవిక, ఏఈవోలు వంశీ, భావన, అశ్రిత, నృపేష్‌కుమార్, సంధ్యరేఖ, రైతులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొళవి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జోషిమోహన్ శర్మ ఎన్నికయ్యారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శిగా చతుర్వేద రాంమోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులుగా అయుచితం శేషాద్రిశేఖరశర్మ, జిల్లా కార్యదర్శిగా జగ్‌జీవన్‌రావు కులకర్ణి, ఈసీ మెంబర్లుగా సునీల్‌కుమార్, కార్తీక్‌లు ఎన్నికయ్యారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖలీల్‌వాడి: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ దేశానికి ఎనలేని సేవ చేశారని, ప్రధానిగా ఉన్నప్పుడు ఫిరాయింపుల నిరోధక చట్టం తీసుకువచ్చారని తెలిపారు. సైన్స్, టెక్నాలజీ అనుబంధ పరిశ్రమలకు ప్రభుత్వ మద్దతును పెంచారని, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలలో దిగుమతి కోటాలు, పన్నులు సుంకాలను తగ్గించారని గుర్తు చేశారు. ఆయన ద్వారానే దేశంలో టెక్నాలజీ పెరిగిందన్నారు. జాతీ య విద్యా విధానాన్ని ప్రకటించినట్లు తెలిపారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు వైశాఖి సంతోష్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, సయ్యద్ ఖైసర్, బొబ్బిలి రామకృష్ణ, ఈసా, రేవతి, ప్రమోద్, కేశ రా జు, ఉష, విజయలక్ష్మి, విజయ రాణి, ముషుపటేల్, నిఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు నిధులివ్వండి



నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించి నిధులు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మంద మకరందం సీడీఎంఏ దివ్యకు విన్నవించారు. హైదరాబాదులోని సీడీఎంఏ కార్యాలయంలో మంగళవారం ఆయన మున్సిపల్ కార్పొరేషన్ సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. కార్పొరేషన్ పరిధిలో సమస్యలు పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే నిజామాబాద్ మున్సిపల్ స్థితిగతులను సీడీఎంఏ వివరించారు. తప్పకుండా కార్పొరేషన్ అభివృద్ధికి పాటుపడతానని సీడీఎంఏ కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

'వేసవి శిక్షణ బాగుంది'



మోర్తాడ్: వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థుల కోసం తిమ్మాపూర్ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం బాగుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ముత్తెన్న అన్నారు. మంగళవారం ఆయన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్యామ్‌ను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సందీప్, సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.

కూలీలు సమయపాలన పాటించాలి



నిజామాబాద్‌రూరల్: ఉపాధి హామీ కూలీలు సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమ తెలిపారు. మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండాకాలం నేపథ్యంలో కూలీలు ఉదయమే తొందరగా వచ్చి పనులు ముగించుకొని వెళ్లాలని పేర్కొన్నారు. స్థానికంగా కూలీలకు టెంట్‌లు, మంచినీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ద్రావణం, అందుబాటులో ఉంచాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేటి చిత్రం..


కసాబ్‌గల్లీ మెయిన్ రోడ్డుపై మురికినీరు



రోడ్డంతా మురికినీరు

నిజామాబాద్ నగరంలోని కసాబ్‌గల్లీ ప్రధాన రహదారిపై మురికినీరు పారుతుంది. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పైకప్పు లీకేజీ కావడంతో మురికినీరు రోడ్డంతా ప్రవహిస్తుంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి ముందు దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఆధ్యాత్మికం..

సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం



డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి తండాలో గల జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం గిరిజనులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు, భోగ్ బండార్ నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి సమృద్ధిగా పంటలు పండాలని, పాడి పశువులు బాగుండాలని కోరుకున్నారు. మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాదర్ మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన సన్మార్గంలో గిరిజనులు ముందుకు సాగాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ బాల గంగాధర్, భూమన్న, తండా పెద్దలు, మాజీ సర్పంచ్ సంతోష్, గంగారాం, తండావాసులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరుక్కల్యాణోత్సవం



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని మహాలక్ష్మినగర్‌లో నేడు(బుధవారం) లక్ష్మీనరసింహస్వామి తిరుక్కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు చారుకొండ రుక్మిణి నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. గంగోత్రి రామానుజాదాసన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం స్వామివారి ఏకోత్తర సహస్ర కలశ అభిషేకం, తిరుక్కల్యాణం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో కాలనీవాసులు, భక్తులు పాల్గొనాలని కోరారు. కమిటీ ప్రతినిధులు నూరే రమేష్, చంద్రశేఖర్ గౌడ్, గంగాధర్, సందగిరి విక్రం రెడ్డి, నరహరి, లవ కుమార్, సత్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి గ్రామంలో తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురువారం రథోత్సవం శుక్రవారం చక్రతీర్థం కార్యక్రమాలు ఉంటాయని పురోహితులు బోనాల నాగరాజు, నటకృష్ణ తెలిపారు. వీడీసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు ధర్పల్లి మండల సమావేశం

ధర్పల్లి: మండల కేంద్రంలో బుధవారం మండల సర్వసభ సమావేశాన్ని ఎంపీపీ సారిక హనుమంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు జరుగుతుందన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

24న ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నిక

డిచ్‌పల్లి:డిచ్‌పల్లి మండలపరిషత్ అధ్యక్ష (ఎంపీపీ), ఉపాధ్యక్ష (వైస్ ఎంపీపీ) పదవులకు ఈ నెల 24న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో సుందరవరద రాజన్ ఆధ్వర్యంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,200	వెండి (కిలో)	93,000
22 క్యారెట్స్	68,450	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	30	గాజరుగడ్డ	35	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	60	80	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	25	40
బీర్నినుకాయ	100	130	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	15	30	కరివేపాకు	40	70
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	80
పుదీనా	60	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 అపరిచితుడు (తెలుగు) – 1.30, 7.30
- స్క్రీన్-2 ది గార్ఫీల్డ్ మూవీ (ఇంగ్లిష్) – 10.45, 4.30, 7.30, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) – 1.40, మిరల్ (తెలుగు) – 10.30
- స్క్రీన్-3 అపరిచితుడు (తెలుగు) – 10.35, మిరల్ (తెలుగు) – 1.50, కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు) – 4.40, 10.30, బాక్ (తెలుగు)–7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 కృష్ణమ్మ (తెలుగు) – 1.20, 7.25, కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (ఇంగ్లీష్) – 4.15, అపరిచితుడు – 10.20
- స్క్రీన్-2 ది గార్ఫీల్డ్ మూవీ (ఇంగ్లిష్) – 12.00, 2.25, 4.50, 7.15, 9.40
- స్క్రీన్-3 కర్తం భుక్తం (హిందీ) – 1.10, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) – 4.05, శ్రీకాంత్ (హిందీ) – 7.00, 10.00
- స్క్రీన్-4 నటరత్నాలు (తెలుగు) – 12.10, దర్శిని (తెలుగు) – 2.50, మిరల్ (తెలుగు) – 5.30, 10.30, అక్కడ వారు ఇక్కడ ఉన్నారు (తెలుగు) – 8.25

రిజర్వేషన్లు ప్రకటించాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలని, ఆ తరువాతే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని బీజేపీ జిల్లా నాయకుడు ఆరే గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యాయబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని, ఆయన డిమాండ్ చేశారు.